

ప్రతి ఒక్కరూ గాంధీ మార్గంలో పయనిస్తే నేరాలే ఉండవని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నగరంలోని పోలీసు కార్యాలయంలో మహాత్ముని విగ్రహానికి నివాళులర్పించారు. ఏఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐలు లీలా రావు, చౌదరి, ఆర్ఐలు టి.భగవాన్, ఎస్.గోపాలనాయుడు, ఆర్.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం నేరవార్తా విభాగం

దుర్గమ్మ.. కొలువుదీరెను నేడు



అమ్మలగన్నమ్మ కనకదుర్గ పండుగ వచ్చేసింది. దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం నుంచి మండపాల్లో తల్లి కొలువుదీరనుంది. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకోనుంది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా మండపాలు, పందిళ్లు సిద్ధమయ్యాయి. బుధవారం నగరం నుంచి పలు ప్రాంతాలకు విగ్రహాలు తీసుకెళ్లారు. – న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

తల్లి నిజరూపం.. నేడు దర్శన భాగ్యం



పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: కోర్కెలు తీర్చే కల్పవల్లి.. భక్తుల నుంచి నీరాజనాలు అందుకుంటున్న పాలకొండ కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. గురువారం నుంచి పది రోజుల పాటు జరగనుండటంతో పట్టణం పండగ శోభను సంతరించుకుంది.

ఏడాదికోమారు భక్తులకు లభించే కోటదుర్గమ్మ నిజరూప దర్శనం గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలగనుంది. ఎనిమిది చేతులతో కనిపించే అమ్మవారిని దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. తొలిపూజలో ఎమ్మెల్యే జయకృష్ణ పాల్గొంటారు. ఆనవాయితీగా వస్తున్న ఆచారం ప్రకారం బేరి కుటుంబసభ్యులు ముహూర్తపు రాటను వేసిన అనంతరం నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి.



విద్యుత్తు దీపాల వెలుగుల్లో ప్రధాన ఆలయం

మీకు నచ్చిన లోగో చెప్పండి

నగరపాలిక పిలుపు

విజయనగరం నగరపాలక సంస్థ ఔన్నత్యాన్ని తెలియజేసేలా లోగో రూపొందించాలన్న విజ్ఞప్తి మేరకు జిల్లావ్యాప్తంగా ఉన్న రూపకర్తలు, ఔత్సాహికులు చిత్రాలు, నమూనాలు, రూపాలు తయారు చేసి పంపించారని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. వాటిలో నాలుగింటిని ఎంపిక చేశామని, అందులో ఒకదానిని మాత్రమే ఉంచుతామన్నారు. నగరవాసులు పరిశీలించి ఈనెల 6వ తేదీలోపు నచ్చిన దానిని ఎంపిక చేసుకుని, ఆ ఫొటో తీసి 98499 06486కు వాట్సాప్ గానీ, commvzm@yahoo.comకు మెయిల్ గానీ చేయాలని కోరారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యం

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉండగలరని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. గాంధీ జయంతి, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ముగింపు సందర్భంగా బుధవారం నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఎస్బీఐ ప్రధాన బ్రాంచి వద్ద ఉన్న మహాత్ముని విగ్రహానికి నివాళులర్పించారు. ఇటీవల వచ్చిన వరదలు, వర్షాల్లో బాధితులకు సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. అనంతరం పెద్దచెరువు వద్ద శుభ్రత పనులు చేపట్టారు. పల్లెలను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ కోరారు. ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, భాజపా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి జి.కృష్ణమూర్తి, కమిషనర్ నల్లనయ్య, సహాయ కమిషనర్ తిరుమలరావు పాల్గొన్నారు.



పెద్దచెరువు వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, ఎమ్మెల్యే అతిది, యశస్వి, నల్లనయ్య తదితరులు

పీఎం జన జాతీయ పథకానికి 9 గ్రామాల ఎంపిక

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి జన జాతీయ గ్రామ్ ఉన్నత్ అభియాన్ పథకం కింద జిల్లాలో తొమ్మిది గ్రామాలను కేంద్రం ఎంపిక చేసిందని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జేసీ సేధు మాధవన్‌తో కలిసి పథకంపై రూపొందించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. రానున్న అయిదేళ్లలో గిరిజనుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన జీవనం, గౌరవప్రదమైన వృద్ధాప్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. డీఆర్వో అనిత పాల్గొన్నారు.

జిల్లాలో ఇలా..

మండలం	గ్రామం
బొబ్బిలి	నిమ్మలపాడు
మెరకముడిదాం	కొండలావేరు
మెంటాడ	కొండలింగాల వలస, లోతుగెడ్డ
బొండపల్లి	వెదురువాడ
గంట్యాడ	దిగువ కొండపర్తి
ఎస్.కోట	దారపర్తి, మూల బొడ్డవర
వేపాడ	కొండగంగుపూడి

పరిశ్రమ పెట్టరు.. స్థలం ఇవ్వరు

★ రద్దు చేద్దామంటే సాంకేతిక సమస్య

పరిశ్రమ కోసం స్థలాన్ని తీసుకొని ఏడాది లోపు యూనిట్ ఏర్పాటు చేయకుంటే సంబంధిత యజమానికి ముందుగా నోటీసు ఇచ్చి, రద్దు చేసేవారు. ఆ స్థలాన్ని కొత్తగా వచ్చే ఔత్సాహికులకు కేటాయించేవారు. కానీ.. తాజా నిబంధనలు గుదిబండగా మారాయి. రద్దు చేయాలంటే యజమాని ఆమోదం తప్పనిసరి చేయడంతో ఏపీఐఐసీకి ఇబ్బందికరంగా మారింది. కనీసం నోటీసులు ఇస్తే తీసుకోని వారు రద్దు చేస్తామంటే ఎలా ముందుకు వస్తారన్నది ప్రశ్నగా మారింది. మరోవైపు యూనిట్ల యజమానుల బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయి. ఈ ప్రభావం పారిశ్రామికవాడ అభివృద్ధిపై పడుతోంది.

– న్యూస్‌టుడే, బొబ్బిలి

బొబ్బిలి పారిశ్రామికవాడలో ఐదేళ్ల కిందట స్థలాలు తీసుకుని పరిశ్రమలు పెట్టని 20 మంది యజమానులను ఆరు నెలల కిందట ఏపీఐఐసీ గుర్తించింది. వారికి నోటీసులు కూడా ఇచ్చారు. వివరణ రాకపోవడంతో రద్దు చేసి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్తే సాంకేతిక సమస్య రావడంతో అధికారులు మిన్నకుండిపోయారు. స్థల యజమాని సంతకాలు ఉండాలి అనడంతో వారికి సమాచారం ఇచ్చినా రాకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. వాటిని రద్దు చేస్తే సుమారు 30 ఎకరాలు అందుబాటులోకి వస్తుంది. ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలోనూ ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. దీనిపై పునరాలోచన చేస్తే తప్ప రద్దుకు అవకాశం లేదు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్‌విండో విధానంలో అనుమతులు జారీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయి.

★ ఆస్తి పన్ను బకాయిలు **రూ.8.50 కోట్లు**
★ నీటి రుసుము **రూ.3 కోట్లు**
★ ఇతర పన్నులు **రూ.1.50 కోట్లు**

రూ.కోట్లలో బకాయిలు

పరిశ్రమలు ఏర్పాటు చేయడమే కాదు యజమానులు ఖాళీ స్థలాల పన్ను కూడా చెల్లించడం లేదు. మూతపడ్డ యూనిట్ల నుంచి కూడా ఆస్తి పన్ను వసూలు కావడం లేదు. పరిశ్రమలకు ఇచ్చిన నీటి సరఫరా రుసుములు రావడం లేదు. సుమారు రూ.13 కోట్ల పైచిలుకు బకాయిలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నారు. నోటీసులు ఇస్తున్నా స్పందన లేదన్నారు. దీనివల్ల అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామని అంటున్నారు.

నిధుల జాడలేదు

పారిశ్రామికవాడ అభివృద్ధికి గత ఐదేళ్లలో నిధులు రాలేదు. రహదారులు పాడయ్యాయి. విద్యుదీకరణ పరికరాలు మూలకు చేరాయి. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపినా పైసా విదల్చలేదు. ఇదిగో అదిగో అంటూ గత ప్రభుత్వం కాలయాపన చేసింది. ఇటీవల వర్షాలకు రహదారులపై భారీ గుంతలు పడి వాహనాలు కూరుకుపోతున్నాయి.



రద్దు చేసేందుకు గుర్తించిన స్థలాల్లో ఇదొకటి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

స్థలాల రద్దుకు ఇబ్బందులు రావడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. స్పష్టత వచ్చాక రద్దు చేస్తాం. యూనిట్ల ఏర్పాటుకు ఎవరు ముందుకు వచ్చినా నిబంధనల మేరకు వెంటనే కేటాయిస్తాం. బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపాం.

– మురళీమోహన్, జోనల్ ప్రబంధకుడు, ఏపీఐఐసీ

నేటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షలు

★ రాయనున్న 22,889 మంది అభ్యర్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆన్‌లైన్‌లో 21 వరకు జరగనున్నాయి. 22,979 మంది అభ్యర్థులు రాయనున్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి 12, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు సెషన్లుగా నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ ఇన్‌ఛార్జిగా, ఆర్డీవో దాట్ల కీర్తి పర్యవేక్షణాధికారిణిగా వ్యవహరించనున్నారు. ఉప తహసీల్దార్లను డిపార్ట్‌మెంటు అధికారులుగా, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లుగా ఇద్దరు ప్రత్యేక ఉప కలెక్టర్లను నియమించినట్లు డీఈవో ప్రేమకుమార్ తెలిపారు. కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తుతో పాటు విద్యుత్తు, రవాణా, వైద్య సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా..

- ★ అభ్యర్థులు పరీక్ష సమయానికి 30 నిమిషాలు ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి.
- ★ నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు.
- ★ హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ ఐడీ తప్పనిసరి.
- ★ వీహెచ్, పీహెచ్ అభ్యర్థులకు 50 నిమిషాలు అదనంగా సమయం కేటాయిస్తారు.
- ★ ఎలక్ట్రానిక్ పరికరాలతో రావడం నిషేధం.

సహాయక కేంద్రం: అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం డీఈవో కార్యాలయంలో సహాయక కేంద్రాన్ని (హెల్ప్‌డెస్క్) ఏర్పాటు చేశారు. 98497 39920, 94933 13271, 94409 41627 నంబర్లలో సంప్రదించవచ్చు.



లెండి ఇంజినీరింగ్ కళాశాల

ఏ కేంద్రంలో ఎంత మంది

ఎక్కడ	అభ్యర్థుల సంఖ్య
స్వామి వివేకానంద ఇంజినీరింగ్ కళాశాల (కలవరాయి, బొబ్బిలి మండలం)	1800
ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, చింతలవలస	4,231
సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గాజులరేగ	3,216
అయాన్ డిజిటల్ జోన్ (గాజులరేగ)	12,852
లెండి ఇంజినీరింగ్ కళాశాల, జొన్నాడ	880

గృహయోగం

ఎన్టీఆర్ స్మార్ట్ సిటీలకు స్థలాన్వేషణ

అల్పాదాయ వర్గాలకు కారు చౌకగా ఇంటి స్థలాలు అందిస్తాం.. ప్రైవేటు లేఅవుట్లకు ధీటుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. గత ప్రభుత్వం మాట.

- ఐదేళ్లలో జగనన్న స్మార్ట్ సిటీల్లో మోక్షం కల్పించలేదు.

న్యూస్‌టుడే, బొబ్బిలి

కూటమి ప్రభుత్వం 'ఎన్టీఆర్ స్మార్ట్ సిటీలు'గా నామకరణం చేసి.. స్థలం ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగా బొబ్బిలి పట్టణ అభివృద్ధి అథారిటీ (బుడా) పరిధిలోని పార్వతీపురం మన్యం, సాలూరు, బొబ్బిలి పురపాలక సంఘాల్లో కొత్తగా స్థల సేకరణ అన్వేషణలో అధికారులు పడ్డారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలు లేదా రైతుల నుంచి కొనుగోలు చేయనున్నారు.



బొబ్బిలిలో గతంలో పరిశీలించిన స్థలం

ఇక్కడ కొత్తగా సేకరణ: పార్వతీపురంలో గతంలో అడ్డాపుశిల వద్ద 30 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. అక్కడ లేఅవుట్ వేస్తే కొనుగోలుదారులు ముందుకు రారని బుడా అభ్యంతరం తెలపడంతో ఇప్పుడు దగ్గరలో సేకరించాలని నిర్ణయం తీసుకున్నారు.

అందరికీ ఒకే దఫా లాటరీ: జాతీయ రహదారి పక్కనే సాలూరులో సుమారు పదెకరాల్లో లేఅవుటు వేశారు. కేవలం 19 మంది ముందుకు రాగా లాటరీలో స్థలాలు కేటాయించారు. 20 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా వస్తే లాటరీలో కేటాయించాలని అధికారులు భావిస్తున్నారు. ఇక్కడ తొలుత నిర్వహించిన సర్వేలో 1,500 మంది స్థలాల కోసం ముందుకొచ్చారు. లేఅవుట్ వేశాక వెనుకంజ వేశారు. మౌలిక సదుపాయాలు కల్పించలేదు.

ఆది నుంచి జాప్యమే: బొబ్బిలిలో రామన్నదొరవలస వద్ద 20 ఎకరాల డీపట్టా భూములను గుర్తించారు. వాటి రైతులకు పరిహారం ఇవ్వకుండా ఎకరాకు 625 గజాల స్థలం అభివృద్ధి చేసి ఇవ్వాలని నిర్ణయించినా.. కొలిక్కి రాలేదు. పారిశ్రామికవాడ సమీపంలో 30 ఎకరాలు పరిశీలించినా.. దారి సమస్యతో ఊరుకున్నారు. రామభద్రపురం, కురుపాంలోనూ లేఅవుట్లు వేయాలని బుడా అధికారులు ప్రతిపాదించినా స్థల సేకరణ జరగలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థలాలు చూస్తున్నామని బుడా పీవో డీవీ దేవకుమార్ తెలిపారు.

సక్షం.. మదిలో అక్షరం



మొక్కలతో ఆహ్లాదకరంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణ

అంగన్‌వాడీకి వెళ్లాలంటే కొందరు పిల్లలు మారం చేస్తారు.. బుజ్జగిస్తే తప్ప ఇళ్ల నుంచి కదిలే పరిస్థితి ఉండదు.. గర్భిణులు, బాలింతలు సైతం కేంద్రాల వద్ద ఉండేందుకు ఇష్టపడరు.. కానీ ఆ గ్రామంలో మాత్రం అంగన్‌వాడీ కేంద్రమే ఓ ఉద్యానం.. అదే ఓ సినిమా థియేటర్.. సరికొత్త అనుభూతిని పంచే భవనం.. సక్షం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తూ అందరి మన్ననలూ పొందుతోంది పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పింద్రింగివలస కేంద్రం.

ఆదర్శం ఇలా.. 'సక్షం' కేంద్ర ప్రభుత్వ పథకం. ఇటీవల కేంద్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మహిళ, శిశు వికాస్ మంత్రి అన్నపూర్ణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే గతేడాది దేశంలో కొన్ని గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి.. మొదలు పెట్టారు. అందులో పింద్రింగివలస ఒకటి. టీవీతో పాటు వివిధ రకాల పరికరాలను అందించారు. ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించేవారు. ఈ సదుపాయాలను కేంద్రం కార్యకర్త బంగారమ్మ సద్వినియోగం చేసుకుని మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే ఈమె 2021లో రాష్ట్రస్థాయిలో చాంపియన్ ఆఫ్ ఐసీడీఎస్‌గా, ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా ప్రశంస దక్కించుకున్నారు.

అంతా ఇక్కడే.. పాచిపెంట మండలంలో ఇదో గిరిజన ప్రాంతం. ప్రారంభంలో చిన్నారులు వెళ్లేవారు కాదు. గర్భిణులు, బాలింతలు సైతం దూరంగా ఉండేవారు. కొన్నేళ్లుగా అక్కడే సేదదీరుతున్నారు. మొక్కలతో కూడిన ఆహ్లాదకర వాతావరణంలో ఉంటూ.. 15 మంది చిన్నారులతో సరదాగా గడుపుతుంటారు. టీవీలో బొమ్మలతో కూడిన పాఠాలు చెబుతున్నామని.. వారు ఇష్టపడే బొమ్మలు, ఆట వస్తువులను సొంతంగా తయారు చేసి బోధిస్తున్నామని బంగారమ్మ చెబుతున్నారు. స్థానికంగా పండే కూరగాయలతో పాటు పూలు, పండ్లను వారికే అందజేస్తున్నామన్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట



పండ్ల రకాల బొమ్మలు



ఎల్ఈడీ టీవీలో దృశ్యాలను తిలకిస్తున్న చిన్నారులు

బదిలీ చేసి.. భర్తీ మరిచి

బొబ్బిలి, న్యూస్‌టుడే: కీలక అధికారులను బదిలీ చేసి.. భర్తీని పట్టించుకోకపోవడంతో బొబ్బిలి జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సాగునీటి నిర్వహణకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. సర్కిల్‌లో ఇప్పటికే కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాజా బదిలీల్లో కొంతమందికి స్థాన చలనం కలిగింది. ఆ స్థానాలింకా భర్తీకి నోచుకోలేదు.

అంతా ఖాళీనే..

ఎస్ఈ రాజరాజేశ్వరిని విజయవాడకు బదిలీ చేస్తూ ఇటీవల ఉత్తర్వులొచ్చాయి. ఆ స్థానంలో ఎవర్నీ నియమించలేదు. ఉప సూపరింటెండెంటు ఇంజినీరు పోస్టు మూడేళ్లుగా ఖాళీగా ఉంది. పార్వతీపురం రెగ్యులర్ డివిజన్ ఈఈ అప్పలనాయుడు, జంఝావతి ఈఈ జగదీశ్వరరావు, డీఈలు కనకారావు, తిరుమలరావుకు తాజాగా స్థానచలనం కలిగింది. వారి స్థానాల్లో కొత్తవారిని ఇవ్వలేదు. పెద్దగెడ్డ జలాశయం పరిధిలో నలుగురు జేఈలకు ఒక్కరే ఉన్నారు. సర్కిల్ కార్యాలయంలో మరో ముగ్గురు జేఈలు అవసరం. కీలకమైన ఎన్‌టీపీఏ(నాన్‌టెక్నికల్) పోస్టు కూడా మూడేళ్లుగా ఖాళీగా ఉంది. ఇలా కీలకమైన కుర్చీలన్నీ ఖాళీగానే ఉన్నాయి.

ఏటా అవస్థలే

కొన్నేళ్లుగా ఏటా ఖరీఫ్‌లో సాగునీటి కాలువలు నిర్వహణకు నోచుకోవడం లేదు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. పెద్దగెడ్డ, జంఝావతి, వట్టిగెడ్డ పరిధిలో సిబ్బంది కొరత ఉంది. పార్వతీపురం, బొబ్బిలి రెగ్యులర్ డివిజన్లలోనూ ఇదే సమస్య. ఆయా కార్యాలయాల్లో కీలక పోస్టులు తాజాగా ఖాళీ అయ్యాయి. మరోవైపు జైకా పనులు పరుగులు పెట్టించాల్సి ఉంది. నాబార్డు, ఇతర గ్రాంట్లలో కొన్ని పనులు మంజూరయ్యే అవకాశం ఉంది. అవి ముందుకు కదలాలంటే సిబ్బంది అవసరం.

ఇప్పటికే కుదింపు..

బొబ్బిలి సర్కిల్‌ను ఇప్పటికే కుదించారు. గతంలో ఎనిమిది డివిజన్లు ఉండేవి. శ్రీకాకుళం జిల్లాలోని సాగునీటి వనరుల పర్యవేక్షణ అంతా ఇక్కడి నుంచే నడిచేది. పునర్విభజనలో భాగంగా రెగ్యులర్, ఎస్ఐ(ప్రత్యేక పరిశీలన), నిర్మాణ డివిజన్లతోపాటు సీతంపేట, రాజాం తోటపల్లి డివిజన్ -2 ఉండేవి. కొన్ని నెలల క్రితం అవి విలీనం చేశారు. పార్వతీపురం, బొబ్బిలి రెగ్యులర్, ఎస్ఐ డివిజన్లు మాత్రమే ఉన్నాయి. సర్కిల్ పరిధి తగ్గిపోయింది. అయినప్పటికీ ఆ మేరకు పోస్టులు లేవు. ఇటీవల సర్దుబాటులో భాగంగా సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో సుమారు ఎనిమిది మంది సిబ్బంది పొరుగు జిల్లాకు వెళ్లిపోయారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీలు జరిగాయని, త్వరలోనే పోస్టులు భర్తీ అవుతాయని సంబంధిత వర్గాలు చెప్పాయి.

పొట్లం విప్పి చూడ.. కల్తీ ఉండును



రంగు మారిన మాంసం

న్యూస్‌టుడే, నేరవార్త విభాగం

- గజపతినగరం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మార్కెట్లో బెల్లం కొనుగోలుకు వెళ్లారు. ఈలోపు ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు ఆ దుకాణంపై దాడులు చేసి, వివిధ పదార్థాల నమూనాలను సేకరించారు. ల్యాబ్‌కు పంపించగా.. బెల్లంలో సల్ఫర్, ఇతర రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు.
- నగరానికి చెందిన ఓ ఉద్యోగి ప్రముఖ కంపెనీకి చెందిన నూనె కొన్నారు. రంగు మారడంతో అనుమానం వచ్చి ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు వెళ్లి పరిశీలించగా.. నాసిరకం అని తేలింది. దీంతో విక్రయదారులపై కేసులు నమోదు చేశారు.
- నగర శివారు ప్రాంతంలోని రెస్టారెంటులో ఓ కుటుంబం భోజనం చేయడానికి వెళ్లింది. చికెన్- 65 రుచి మారింది. రంగు ఎక్కువగా ఉంది. వారి ఫిర్యాదుతో అధికారులు రంగంలోకి దిగగా.. ఆకర్షించేందుకు రసాయనాలు వాడినట్లు గుట్టు రట్టు చేశారు.

బెల్లం మెరిసిపోతోంది.. టీపొడి మంచి వాసనొస్తోంది.. కందిపప్పు భలేగా ఉంది.. నెయ్యి నిగనిగలాడుతోంది.. చికెన్- 65 ఎర్రగా కనిపిస్తూ నోరూరిస్తోంది.. అయితే ఒక్క క్షణం ఆగండి.. రంగు, వాసన చూసి కొనేయకండి.. అవి కల్తీవి కూడా కావొచ్చని చెబుతున్నారు ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు. ఇటీవల నిర్వహిస్తున్న దాడుల్లో పెద్దఎత్తున రసాయనాలతో కూడిన పదార్థాలను పట్టుకుంటున్నారు. ఈమేరకు విస్తుగొల్పే విషయాలను వెల్లడించారు.

47 కేసులు.. జిల్లాలో ఆహార కల్తీ పెద్దఎత్తున సాగుతోంది. చిన్నపాటి దుకాణాల నుంచి పెద్ద స్థాయి హోటళ్ల వరకు రసాయనాలతో కూడిన పదార్థాలు దర్శనమిస్తున్నాయి. రోజూ ఎక్కడో ఓ చోట ఇలాంటి ఘటనలు బయటపడుతున్నాయి. గత ఆరు నెలల వ్యవధిలో ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు 47 కేసులు నమోదు చేశారు. అంటే ఆహార కల్తీ ఏమేర సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. తరచూ దాడులు లేకపోవడం, వినియోగదారులు గుర్తించలేకపోవడం, విక్రయదారుల విచ్చలవిడితనం.. తదితర కారణాలతో ఈ దుస్థితి నెలకొంది.



నల్లగా మారిన నూనెను చూపిస్తున్న అధికారి

పాడి నుంచి పండ్ల వరకు.. నిత్యావసరాలను వినియోగించే వాటిలో ఎక్కువగా కల్తీ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ విశ్రాంతి ఉద్యోగి మార్కెట్లో అరకిలో టీ-పొడి కొని, టీ పెట్టమని కుటుంబ సభ్యులను కోరారు. వారు వేడినీళ్లలో పొడి వేయగానే రంగుమారిపోయింది. వెంటనే దుకాణానికి వెళ్లగా.. తనకు సంబంధం లేదని యజమాని చెప్పారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు.. తనిఖీ చేయగా.. రసాయనాలు వాడినట్లు స్పష్టం చేశారు. ★ బొబ్బిలి ప్రాంతానికి చెందిన ఓ మహిళ కొన్న యాపిల్ పండ్లు నెలరోజులైనా పాడవలేదు. అధికారులు పరిశీలించగా.. రసాయనాల పూత ఉన్నట్లు తేల్చారు.

ఫిర్యాదు చేయండి..

మా బాధ్యతగా ప్రతి నెలా తనిఖీలు నిర్వహిస్తున్నాం. వ్యాపారులంతా నియమ, నిబంధనలు పాటించాలి. వినియోగదారులు అప్రమత్తంగా ఉంటేనే కల్తీపై కేసులు నమోదు చేయగలం. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే మా దృష్టికి తీసుకురావాలి. – ఈశ్వరి, ఆహార కల్తీ నియంత్రణ శాఖాధికారిణి



గాంధీజీ జయంతి సందర్భంగా విజయనగరంలోని జిల్లా న్యాయస్థానంలో మహాత్ముని చిత్రపటానికి నమస్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి, ఇతర న్యాయమూర్తులు. – న్యూస్‌టుడే, న్యాయవార్తా విభాగం

ఆ మూడు రోజులూ కార్మికులకు సెలవు!

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి పండగ నేపథ్యంలో నగరంలో ఈనెల 13, 14, 15న తేదీల్లో కార్మికులకు సెలవులు ప్రకటించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. హోటళ్లు, సంస్థలు, దుకాణాల్లో పనిచేసే వారిని సేవల్లో భాగస్వాములను చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బుధవారం కలెక్టర్ అంబేడ్కర్ సంబంధిత అధికారులతో చర్చించారు. సెలవులపై త్వరలోనే ప్రకటన చేస్తామన్నారు. ఆహార పదార్థాలకు ఇబ్బందులు లేకుండా ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని, దీనిపై చర్చించనున్నామన్నారు. డీఆర్వో అనిత, సీపీవో బాలాజీ, డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై హత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్యాభర్తలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని మోహర్ కాలనీలో నివాసం ఉంటున్న భార్యాభర్తలు వి.సత్యనారాయణ, పార్వతిపై అదే కాలనీకి చెందిన వై.గణేష్‌నాయుడు హత్యాయత్నానికి పాల్పడినట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఇంటి విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తడంతో బుధవారం కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు చెప్పారు. ఆయన వివరాల ప్రకారం.. గణేష్‌నాయుడు పదేళ్ల కిందట సత్యనారాయణ వద్ద రూ.4.50 లక్షలు తీసుకుని తన ఇంటిని వారికి కుదవ పెట్టారు. ఇటీవల మరో వ్యక్తికి విక్రయించాడు. ఈక్రమంలో తాను కట్టిన నగదు ఇవ్వకపోవడంతో ఆ ఇంట్లో తన భార్య పార్వతితో కలిసి నివాసముంటున్న సత్యనారాయణ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఆగ్రహానికి గురైన యజమాని దాడి చేశాడు. పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. క్షతగాత్రులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో చోదకుడి మృతి

తొండంగి, న్యూస్‌టుడే: ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీ కొట్టడంతో అందులోని చోదకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కత్తిపూడి నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ బెండపూడి సమీపంలో ఆగింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ బుధవారం తెల్లవారుజామున ఢీకొట్టింది. దీంతో వాహనం నడుపుతున్న పార్వతీపురం మండలం బుచ్చింపేట గ్రామానికి చెందిన బి.వెంకటరమణ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి తుని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

ఆరు వాహనాల్లో 38 మూగజీవాలు

పట్టుకున్న కొమరాడ పోలీసులు

కొమరాడ, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మూగజీవాలతో తరలివెళుతున్న వాహనాలను బుధవారం కొమరాడ పోలీసులు పట్టుకున్నారు. కొమరాడ పోలీసు ఠాణా వద్ద వాహనాలను అదుపులోకి తీసుకుని పరిశీలించారు. ఎస్ఐ నీలకంఠం తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి పార్వతీపురం, అడ్డాపుశిలకు ఆరు బొలెరో వాహనాల్లో 38 పశువులను తరలిస్తున్నారనే సమాచారంతో నిఘా పెట్టామన్నారు. ఈమేరకు తనిఖీలు నిర్వహించి, పశువులతో వెళుతున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. చోదకులపై కేసులు నమోదు చేశామన్నారు. పశు అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



వాహనంలో కుక్కి తరలిస్తున్నారిలా..

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఘటన గంట్యాడ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికృష్ణ వివరాల మేరకు.. జగ్గాపురం గ్రామానికి చెందిన ఎం.అప్పలనాయుడు(42) కొంతకాలంగా అత్తగారి ఊరు మరిచర్లలో నివాసం ఉంటున్నాడు. ఆయన ఓ మహిళతో వివాహేతర సంబంధంలో ఉన్నాడని భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగినా ఆయనలో మార్పు లేకపోవడంతో ఆమె మరోసారి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం తాపీ పనికి వెళ్తున్నట్లు చెప్పి స్వగ్రామం జగ్గాపురంలోని ఇంటికి వచ్చి ఉరేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జ్వరంతో నేల రాలిన విద్యాకుసుమం



అవంతి (పాతచిత్రం)

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని తీవ్ర జ్వరం, రక్తహీనతతో మంగళవారం రాత్రి మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. గుమ్మలక్ష్మీపురం మండలం కె.శివడకు చెందిన నిమ్మల బాబురావు, మల్లేశ్వరి దంపతుల కుమార్తె అవంతి(13) పి.ఆమిటిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆగస్టు 29న కాలుపై వాపు రావడంతో కుటుంబ సభ్యులు వసతి గృహం నుంచి ఇంటికి తీసుకెళ్లారు. జ్వరం రాగా పరీక్షలు చేయించారు. ఈక్రమంలో రక్తఫలకికలు(ప్లేట్‌లెట్స్) తగ్గాయని వైద్యులు చెప్పడంతో 30న పార్వతీపురం.. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం తీసుకెళ్లారు. ఆరోగ్యం కుదుటపడడంతో సెప్టెంబరు 13న పాఠశాలకు తీసుకెళ్లగా.. అక్కడ ఉండనని చెప్పడంతో తిరిగి ఇంటికి తీసుకెళ్లారు. 22న మళ్లీ జ్వరం రావడంతో పరీక్షలు చేయించగా రక్తహీనత అని తేలింది. దీంతో పార్వతీపురం తీసుకెళ్లి 30న రక్తం ఎక్కించినా ప్రయోజనం లేకపోయింది. అక్కడే ప్రాణాలు విడిచింది. కళ్లముందే కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. ఏటీడబ్ల్యూవో సురేష్, పాఠశాల సిబ్బంది బాధితులను పరామర్శించారు.

రక్తదాతకు జాతీయ అవార్డు



ప్రశంసాపత్రం అందుకుంటున్న దుర్గాప్రసాద్

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రక్తదాన సేవలకు గానూ జరజాపుపేట ప్రాంతానికి చెందిన సాధన యువజన సంఘం అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్‌కు జాతీయస్థాయి అవార్డు దక్కింది. కేంద్ర వైద్య శాఖ రాష్ట్రం నుంచి నెల్లిమర్ల, అనంతపురానికి చెందిన ఇద్దరిని ఎంపిక చేసింది. జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి జైపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్యశాఖ జాతీయ కార్యదర్శి అతుల్ గోయల్ చేతులమీదుగా దుర్గాప్రసాద్ అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. 14 ఏళ్లుగా రక్తదాన శిబిరాల నిర్వహణ, ఎక్కువ మంది రక్తదాతల నుంచి సేకరణ, అత్యధికంగా 63 సార్లు రక్తదానం చేసినందుకు గానూ పురస్కారానికి ఎంపిక చేసినట్లు 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	124	218	228

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలేవీ?

– న్యూస్‌టుడే, శృంగవరపుకోట, చీపురుపల్లి, గరివిడి

గ్రామాల్లో చెత్త ఊడ్చి, కాలువలు శుభ్రం చేస్తూ.. ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు మాత్రం నిత్యం పస్తులు తప్పడం లేదు. అసలే తక్కువ వేతనం, అదీ నెలల తరబడి చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. దసరా పండగ వస్తోంది.. కుటుంబానికి కనీసం కడుపునిండా తిండి పెట్టలేని దయనీయ పరిస్థితిలో ఉన్నామని జిల్లాలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని 17 మేజరు పంచాయతీల్లో ఒకట్రెండు తప్ప మిగతా అన్నీ నిధుల లేమితో సతమతమవుతున్నాయి. వీటిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలల నుంచి 12 నెలల వరకు వేతనాల బకాయిలున్నాయి. రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు కేవలం ఎస్.కోట మేజర్ పంచాయతీలోనే ఎక్కువగా ఉన్నారు. మిగతా వాటిల్లో ఒకరిద్దరు చొప్పున ఉన్నారు. శాశ్వత కార్మికులు లేకపోవడంతో పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులకు ఒప్పంద పద్ధతిలో కార్మికులను తీసుకుంటున్నారు. టెండర్లు పిలిచి అతి తక్కువ మొత్తానికి వేసిన వారికి ఖరారు చేస్తున్నారు. ఏటా మార్చిలో ఒప్పంద కార్మికులకు టెండర్లు పిలిచి ఏడాది కాలపరిమితితో నియమిస్తున్నారు. సాధారణ నిధుల ఖాతాలో నిల్వలు లేక వేతనాలు సకాలంలో చెల్లించలేకపోతున్నామని పంచాయతీ ఈవోలు చెబుతున్నారు.



శృంగవరపుకోట పంచాయతీ కార్యాలయం

జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఎస్.కోటలో రెగ్యులర్ 11 మంది, ఒప్పంద, ప్లంబర్లు, వాహన చోదకులు, వాచ్‌మెన్‌లు, వీధి దీపాల నిర్వాహకులు మరో 48 మంది ఉన్నారు. వీరందరికీ ఒక నెల వేతనం చెల్లించాలంటే రూ.10 లక్షలు అవసరం. ప్రస్తుతం రెగ్యులర్ వారికి ఆరు నెలలు, ఒప్పంద విభాగం వారికి నాలుగు నెలల వేతనాలు చెల్లించాలి. అక్టోబరులో దసరా, దీపావళి పండగల నేపథ్యం బకాయిలు చెల్లించకుంటే పస్తులు తప్పవని వాపోతున్నారు. ఈ విషయమై ఈవో అనురాధ వద్ద ప్రస్తావించగా రెండు నెలల బకాయి చెల్లించేలా ప్రయత్నిస్తామన్నారు.

★ చీపురుపల్లిలో శాశ్వత కార్మికులు ఏడుగురికి 12 నెలలు, ఒప్పంద విభాగంలో 51 మందికి ఆరు నెలలుగా ఇవ్వలేదు. వీరికి నెలకు చెల్లించాల్సింది రూ.12 లక్షలు. రెండ్రోజుల్లో కొన్ని నెలల వేతనాలైనా చెల్లించే ఏర్పాటు చేస్తామని ఈవో వేణుగోపాలరావు తెలిపారు. ఇంటి పన్నులు జనవరి నుంచి మార్చి వరకు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు.

★ గరివిడిలో 27 మంది ఉన్నారు. వీరికి అయిదు నెలలుగా అందలేదు. నెలకు రూ.3.78 లక్షల మేర వేతనాలకు చెల్లించాల్సి ఉంది. స్టాంపు డ్యూటీ కింద పంచాయతీకి రూ.25 లక్షలు రావాల్సి ఉందని, సాధారణ నిధి ఖాతాలో నిధులు జమ కాగానే బకాయిలు చెల్లిస్తామని ఈవో శ్రీనివాస్ తెలిపారు.

నెల్లిమర్ల వీధుల్లో నడక సాగించలేం

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని 7వ వార్డులో కాలువల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో పలుచోట్ల తవ్వి వదిలేశారు. స్థానికంగా ప్రధాన డ్రైన్ ఏర్పాటుకు ఆరు నెలల క్రితం తవ్వకాలు చేపట్టారు. బిల్లులు రాకపోవడం, ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో గుత్తేదారు వదిలేశారు. అప్పటి అధికారులు సైతం దృష్టిసారించలేదు. చాలాచోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో కొందరు చెక్కలు, కర్రలను ఏర్పాటు చేసుకొని రాకపోకలు కొనసాగిస్తున్నారు. దీనిపై ఏఈ త్రినాథరావును వివరణ కోరగా ప్రధాన కాలువ నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షలు కేటాయించామని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల



మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? గోషాడలో అంగన్‌వాడీ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు

☛ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గుత్తేదారులు ముందుకు రాలేదు. - ఆరుద్ర, సీడీపీవో

– న్యూస్‌టుడే, గుర్ల

? రామభద్రపురం గ్రామ రహదారి మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. - స్థానికులు

☛ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. - వై.ప్రసాదరావు, ఎస్సై

– న్యూస్‌టుడే, రామభద్రపురం

రూ.2.70 కోట్లతో ఉపాధి పనులు

రేగిడి, న్యూస్‌టుడే: రేగిడి మండలం అంబకండి పంచాయతీలో బుధవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.70 కోట్ల విలువైన పనులు చేపట్టాలని సభలో తీర్మానించారు. కార్డుదారులకు 41,586 పనిదినాలు కల్పించే లక్ష్యంతో బడ్జెట్ రూపొందించినట్లు సభ్యులు పేర్కొన్నారు. సర్పంచి ఎస్.గోవిందరావు, ఉపాధిహామీ ఏపీవో హరనాథ్, పంచాయతీ కార్యదర్శి హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

రహదారిపై గంగమ్మ



ఈ చిత్రం చూసి.. రహదారిపై నుంచి నీరు ఎలా వస్తోంది అనుకుంటున్నారా.. బొబ్బిలి పురపాలక కార్యాలయం ఎదుట ఉన్న రహదారి అడుగున వేసిన పైపులైన్లు లీకవడంతో తాగు నీరు పైకి చిమ్ముతోంది. ఆ నీటిని అక్కడ ఉన్న కొంతమంది కూరగాయల వ్యాపారులు ఇలా పట్టుకుని శుభ్రం చేసేందుకు వినియోగిస్తున్నారు. పట్టణంలో ఎప్పటికప్పుడు పైపులైన్ల లీకులతో రోడ్లు పాడైపోతున్నాయని ప్రజలు అంటున్నారు. లీకులు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

వక్తృత్వ, ప్రతిభా పోటీలు

రాజాం, న్యూస్‌టుడే: గడిముడిదాం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు వాతావరణంలో వచ్చిన మార్పులు, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, పిల్లలపై ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రభావం అనే అంశాలపై వక్తృత్వ పోటీలు, పాఠ్యాంశాలపై ప్రతిభ పోటీలు నిర్వహించినట్లు హెచ్ఎం బి.అప్పలస్వామి తెలిపారు. విజేతలకు బుధవారం జ్ఞాపికలు అందజేశారు. వీటిని గ్రామానికి చెందిన సిపాయి సత్యనారాయణ, కార్యదర్శి సురేష్‌లు సమకూర్చారన్నారు. ఉపాధ్యాయులు జి.సూరప్పలనాయుడు, బాలమురళీ, డి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



సాధించిన జ్ఞాపికలతో విద్యార్థులు

ఆటకు చోటేదీ?

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు తప్పని సరి. శారీరక, మానసిక దృఢత్వానికి ఆటలు దోహదపడతాయి. కానీ చీపురుపల్లి నియోజకవర్గంలో కొన్ని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాల్లేవు. కొన్నిచోట్ల స్థలాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. – న్యూస్‌టుడే, గరివిడి, చీపురుపల్లి, గుర్ల



గరివిడి మండలం కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఈ బాలికలు టెన్నికాయిట్‌లో జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించారు. కానీ ఇక్కడ ఉన్నత పాఠశాలకు క్రీడా మైదానం లేదు. రోజు గ్రామం నుంచి దాదాపు 3 కి.మీ దూరంలో ఉన్న చీపురుపల్లి అగ్నిమాపక దళ కేంద్రం ఆవరణలో మైదానానికి వచ్చి శిక్షణ పొందుతున్నారు.

నియోజకవర్గంలో పాఠశాలల పరిస్థితి..

మండలం	యూపీ ఉన్నత	మైదానాలు లేనివి
చీపురుపల్లి	15	07
గరివిడి	19	05
గుర్ల	18	02

తప్పని ఇక్కట్లు..

గరివిడి మండలంలో కొండలక్ష్మీపురం, దేవాడ ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాల్లేవు. ఆటలు ఆడేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అర్తమూరు యూపీ పాఠశాలకు 4 సెంట్లు, కె.పాలవలస, కుమరాం యూపీ పాఠశాలలకు 5 సెంట్ల చొప్పున ఆట స్థలాలు ఉన్నా వినియోగించడం లేదు. ◆ చీపురుపల్లి మండలంలో బాలికల ఉన్నత పాఠశాల, రామాంజనేయ కాలనీ, దేవరాపొదిలాం, పీకే పాలవలస ఉన్నత పాఠశాలల్లో మైదానాలు లేవు. దీంతో విద్యార్థులు వ్యాయామ విద్యకు దూరంగా ఉంటున్నారు. జి.అగ్రహారం, పర్ల, రామలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలకు ఆట స్థలాలు లేవు. ◆ గుర్ల మండలంలో కొండగంగ్రేడు ఉన్నత పాఠశాలలో మైదానం లేదు. జమ్ము ప్రాథమికోన్నత పాఠశాల 5 సెంట్ల విస్తీర్ణంలో ఉండటంతో మైదానానికి లేకుండా పోయింది.

గతంలో అరకొరగా పనులు..

2019కి ముందు తెదేపా ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకంలో పాఠశాలల్లో క్రీడా మైదానాల అభివృద్ధికి పనులు చేపట్టినా అరకొరగానే జరిగాయి. ఒక్కో మైదానానికి రూ.5 లక్షలు కేటాయించి మూడు క్రీడలకు సంబంధించిన కోర్టులు, నడక మార్గం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ పనులు సక్రమంగా జరగలేదు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ పనుల జోలికే పోలేదు.

చీపురుపల్లిలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 550 మంది బాలికలు చదువుతున్నారు. ఇక్కడ మైదానం లేదు. కానీ ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయినులు ఉన్నారు. మైదానం లేక బాలికలు వ్యాయామ విద్య, ఆటలకు దూరం అవుతున్నారు.



ప్రతిపాదనలు పంపుతాం..

క్రీడా మైదానాలు అవసరమైన, ఆట స్థలాలు అభివృద్ధి చేయాల్సి పాఠశాలలను గుర్తించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. – రామారావు, బూసినాయుడు, ఎంఈవోలు, గరివిడి, చీపురుపల్లి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



యూటీఎఫ్ నాయకుల నిరసన

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గాంధీ జయంతి సందర్భంగా మండల విద్యావనరుల కేంద్రం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేయాలని, జీపీఎఫ్ నంబర్లు కేటాయించాలని, పదోన్నతులు కల్పించాలని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు విజయగౌరి కోరారు. జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, కృష్ణదాసు, స్వామినాయుడు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పదిరోజులుగా విద్యుత్తుకు అంతరాయం

మెరకముడిదాం, న్యూస్‌టుడే: రామాయవలసలో విద్యుత్తు సరఫరాలో అంతరాయంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. నియంత్రిక మరమ్మతులకు గురై పదిరోజులు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్క గ్రామం నుంచి సింగిల్ ఫేజ్ విద్యుత్తును గృహాలకు తాత్కాలికంగా ఇచ్చారని, దాంతో గ్రామంలో పంపింగు మోటారు పనిచేయక తాగునీటికి సైతం ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. పంపుసెట్లు పనిచేయక వరి పంటకు నీరు అందించలేకపోతున్నామని రైతులు అంటున్నారు. దీనిపై ఏఈ రమేష్ మాట్లాడుతూ.. నియంత్రిక మార్చేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతామన్నారు.

నిర్వహణ లేక నిరుపయోగం



ప్రభుత్వం పంచాయతీలను బలోపేతం చేస్తామని, అందులో భాగంగా ఉపాధి పథకం నిధులతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్వహణలోకి తేవాలని ఆదేశించినా తీరు మాత్రం మారలేదు. చింతాడ సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. ఇక్కడ తొట్టెలు శిథిలావస్థకు చేరి, పనికిరాని మొక్కలు పెరిగాయి. పరిశీలించి నిర్వహణలోకి తీసుకొస్తామని ఈవోపీఆర్డీ భాస్కరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

అపరిశుద్ధ్యంతో అవస్థలు

పెదమానాపురం వారపు సంతలో అపరిశుద్ధ్యం రాజ్యమేలుతోంది. ప్రతి వారం చెత్త కుప్పలుగా పోగు అవుతున్నప్పటికీ పంచాయతీ అధికారులు, సంత యాజమాన్యం పట్టించుకోవడంలేదు. వినియోగదారులు, అమ్మకందారులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ వాజీద్ మాట్లాడుతూ.. ప్రతి శనివారం ఇక్కడ సంత జరుగుతుంది. చెత్త ఏర్పడటం సహజం. మరుసటి వారానికి శుభ్రం చేయాల్సిన బాధ్యత సంత యాజమాన్యంపై ఉంది. పంచాయతీ కార్యదర్శి, యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, దత్తిరాజేరు



దుమ్ము రేగుతోంది



గరివిడి రైల్వే వంతెన పక్క నుంచి గర్భాం వెళ్లే రహదారి పక్కన నివాసితులు దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్నారు. మెరకముడిదాం మండలంలోని ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు వెళ్లే వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. రహదారిలో పడిన గోతులను మట్టితో కప్పేసి వదిలేశారు. లారీలు వెళ్లేటపుడు మట్టి రేగి ఇళ్లలోకి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులన్నీ పూడ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామని, మంజూరు కాగానే సమస్యను పరిష్కరిస్తామని ర.భ.శాఖ ఏఈ మూర్తి తెలిపారు. – న్యూస్‌టుడే, గరివిడి

భవనం పూర్తి ఎప్పటికో?

కారాడలో మూడేళ్ల కిందట రూ.40 లక్షల ఉపాధి పథకం నిధులతో ప్రారంభించిన సచివాలయం నేటికీ పూర్తికాలేదు. సకాలంలో బిల్లులు అందకపోవడం, నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడం తదితర కారణాలతో స్లాబ్ వరకు నిర్మించి గుత్తేదారు వదిలేశారు. దీంతో ప్రస్తుత సచివాలయం సిబ్బంది రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. భవనం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని ఏఈ రాజశేఖర్ తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం



ఎనిమిదేళ్లుగా ఇలానే!



నరవ గ్రామంలో అంగన్‌వాడీ చిన్నారులకు వసతి సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన ప్రసన్న భవనం ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా ఉంది. దీంతో చెట్లు పెరిగి శిథిలావస్థకు చేరుకుంది. బిల్లుల సమస్యతో గుత్తేదారుడు పనులు ఆపేశారు. అదిగో ఇదిగో అంటూ అధికారులు కాలం గడిపారు. ప్రస్తుతం చిన్నారులు అద్దె గదిలో ఇరుకులో అసౌకర్యానికి గురవుతున్నారు. అప్పటి భవనాలకు నిధులు నిలిచిపోయాయని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని పీఆర్ ఏఈ కృష్ణమూర్తి అన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

అందం.. ఆహ్లాదం.. ఆనందం



రంగరాయపురం పాఠశాల ముందు మొక్కలు



పచ్చదనంతో నిండిన పరిసరాలు

బొండపల్లి, బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సరస్వతీ నిలయాలు విద్యార్థులకు విద్యతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పచ్చని చెట్లు చల్లని గాలితో ఆనందాన్ని నింపుతున్నాయి. బొబ్బిలి మండలం రంగరాయపురం ప్రాథమిక పాఠశాల నందనవనంలా కనిపిస్తోంది. పరిసరాలు శుభ్రంగా ఉంచుతున్నారు. 2017-18, 2021-22 విద్యా సంవత్సరాల్లో ఈ పాఠశాలను రాష్ట్రస్థాయిలో 'స్వచ్ఛ విద్యాలయ' పురస్కారాలు వరించింది. పాఠశాల పరిశీలనకు వచ్చిన అధికారులు ఆవరణలో మొక్కలను, మరుగుదొడ్లు, తరగతి గదులను చూసి ప్రశంసిస్తూ అవార్డును అందజేశారు. పూర్వ ప్రధానోపాధ్యాయుడు విజయ్‌భాస్కర్, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు నాగరాజు ప్రత్యేక శ్రద్ధతో మొక్కలను పెంచుతున్నారు. పూర్వ విద్యార్థులు, దాతల సాయంతో విజయనగరం, బొబ్బిలి, సాలూరు, ఇతర ప్రాంతాల నుంచి వివిధ రకాల మొక్కలు తెప్పించి ఇక్కడ నాటారు. ఇనుప గేటు, కళావేదిక, సరస్వతీదేవి విగ్రహాన్ని దాతలు నిర్మించారు. వంగ, ఆనప, బెండ, ఆకు కూరలు, జామ, అరటి తదితర మొక్కలు నాటారు.



బొండపల్లి ఉన్నత పాఠశాల

బొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎటు చూసినా అందమైన మొక్కలు కనువిందు చేస్తున్నాయి. అప్పటి ప్రధానోపాధ్యాయుడు టి.సన్యాసిరాజు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు బి.ఉమామహేశ్వరరావు కృషి ఫలితంగా పచ్చదనం వెల్లివిరుస్తోంది. ఆవరణలో మొక్కలు సిబ్బంది వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకున్నారు. విద్యార్థులు సెలవు దినాల్లోనూ నీరు పోస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఆవరణలో సరస్వతీదేవి, వివేకానందస్వామి, గౌతమ బుద్ధుడు, మహాత్మా గాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణ, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాలను ఏర్పాటు చేశారు.

బాపూజీ ఆశయ సాధనకు కృషి



బొబ్బిలి: వేషధారణలో పెంట పాఠశాల విద్యార్థులు

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన సేవలు, త్యాగాల్ని అంతా కొనియాడారు. బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. బొబ్బిలి, రాజాం, చీపురుపల్లి, గజపతినగరం నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీకి నివాళులర్పించారు. జయంతి వేడుకల్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. పారిశుద్ధ్య కార్మికుల్ని సత్కరించారు. బొబ్బిలి పట్టణంలో కమిషనర్ రామలక్ష్మి, ఉప కారాగారంలో సీనియర్ సివిల్ జడ్జి అరుణ ఆధ్వర్యంలో అంజలి ఘటించారు. బొబ్బిలిలో వనమిత్ర అధ్యక్షుడు కృష్ణదాసు.. గాంధీ జీవిత విశేషాలతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. బొండపల్లి మండలం చామలవలసలో ఆర్యవైశ్య కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ గాంధీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. మహాత్ముని అడుగు జాడల్లో నడిస్తే ఆదే దేశానికి మనం ఇచ్చిన గౌరవమని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. రాజాం పట్టణంలోని కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. రేగిడి మండలం పనసలవలసను ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దత్తతతీసుకుని అభివృద్ధి చేస్తామని జీఎంఆర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ గాంధీ జయంతి కార్యక్రమంలో చెప్పారు. రాజాం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామఅప్పలనాయుడు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. వంగర గ్రంథాలయం ఆవరణలో గాంధీ జయంతి నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం



చీపురుపల్లి: విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



పూలమాల వేస్తున్న కమిషనర్ రామలక్ష్మి తదితరులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

పుస్తక పఠనంపై అవగాహన

చీపురుపల్లి గ్రామీణం: చీపురుపల్లి మండలం అలజంగి, మెట్టపల్లి గ్రామాల్లో బుధవారం ఆశయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రమణ సంచార గ్రంథాలయం తీసుకెళ్లి యువత, విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు.

యువకుడికి తీవ్ర గాయాలు

బాడంగి(రామభద్రపురం): మెట్టవలస గ్రామానికి చెందిన ఎ.వాసు ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి పినపెంకి వద్ద వెళ్తుండగా ట్రాక్టరు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని రాజాంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ కొండలరావు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దేవియాగ మహోత్సవాలు

గరివిడి: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన విద్యాసౌరశక్తి పీఠంలో ఈ నెల 3 నుంచి 18 వరకు శరన్నవరాత్రి సహిత విద్యా మహాత్రిపురా సుందరిదేవి యాగ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠం నిర్వాహకులు సూర్యనారాయణ శర్మ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

242 మద్యం సీసాల స్వాధీనం

బొబ్బిలి: పట్టణంలోని దాడితల్లి కాలనీ వద్ద మంగళవారం అర్ధరాత్రి సమయంలో వి.సూరిబాబు ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న 242 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై రమేష్ తెలిపారు.

తప్పిన ప్రమాదం



బొబ్బిలి గ్రామీణం: ముత్తాయవలస ఎస్సీ కాలనీలో ఎచ్చెర్ల అప్పన్న, మంగమ్మ ఇంటి స్లాబ్ మంగళవారం రాత్రి కూలిపోయింది. కుటుంబ సభ్యులంతా భోజనాలు చేసి.. బయట కూర్చున్న సమయంలో ఘటన జరిగింది.

అధికారుల శ్రమదానం

తెర్లాం, మెరకముడిదాం, రాజాం గ్రామీణం: స్వచ్ఛతా హీ సేవా ముగింపు సందర్భంగా ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ విస్తరణాధికారిణి నీలిమ తదితరులు నందబలగలో పరిసరాలు శుభ్రం చేశారు. మెరకముడిదాంలో ఎంపీడీవో రత్నం తదితరులు పరిశుభ్రత పనులు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని రాజాం ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం

సంతకవిటి: ప్రతి ఒక్కరూ ఏడాదిలో రెండుసార్లు నేత్ర పరీక్షలు చేయించికోవాలని ఆప్తాలమిక్ ఎస్.వసంతరావు అన్నారు. సంతకవిటి పీహెచ్‌సీలో డా.నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నేత్రవైద్య శిబిరం నిర్వహించారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు

వంగర: ప్రసిద్ధ రుషింగి దుర్గాభవానీ ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయ ప్రాంగణంలో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఏటా సుమారు 400 మంది పది రోజుల పాటు దుర్గాభవానీ మాలలు ధరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రేగిడి, న్యూస్‌టుడే: సంకిలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.హరీష్, కె.తేజేశ్వరరావు అండర్ - 14.. ఎం.త్రివిక్రమరావు అండర్ - 17 బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సత్యన్నారాయణ బుధవారం తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

రాకపోకలకు నరకం



అధ్వానంగా నడుపూరు - భూపాలపురం రోడ్డు

గ్రామీణ రహదారులు పూర్తిగా అధ్వానంగా మారుతున్నా.. పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. గుర్ల మండలంలోని నడుపూరు - భూపాలపురం, ఆనందపురం - చింతలపేట, గొలగాం శివకోవెల నుంచి రాగోలు వెళ్లే దారులు బురదమయంగా.. గజానికో గుంతతో అడుగుపెడితే జారపోతామేమోనన్నంత భయంకరంగా ఉన్నాయి. చినుకు పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఈ దారుల్లో రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నామని పాలకులు, అధికారులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మండల ఇంజినీరింగు అధికారి సాల్మాన్‌రాజు వద్ద ప్రస్తావించగా మండలంలో కొన్ని రహదారుల బాగుకు ఉపాధి నిధులతో ప్రతిపాదనలు పంపామన్నారు. – న్యూస్‌టుడే, గుర్ల

పరిశుభ్రత అందరి బాధ్యత

సంతకవిటి, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం స్ఫూర్తిగా గ్రామాలను, పట్టణాలను శుభ్రం చేసుకునే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని శ్రీకాకుళం జడ్పీ వైస్ ఛైర్మన్ ఎస్.జగన్‌మోహనరావు అన్నారు. బుధవారం సంతకవిటి మండల పరిషత్తు కార్యాలయంలో మహాత్మ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కార్మికులను సన్మానించారు. బొద్దూరు ఉన్నత పాఠశాలలో గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు.



కార్మికులను సన్మానిస్తున్న జడ్పీ వైస్ ఛైర్మన్ తదితరులు

ఊరేగింపు.. నగర కీర్తనలు



పల్లకిలో వేంకటేశ్వరస్వామి



చిన్నారుల కోలాటం

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తలపెట్టిన 11 రోజుల ప్రాయశ్చిత దీక్ష ముగింపు సందర్భంగా బొబ్బిలిలో బుధవారం రాత్రి కూటమి నేతలు వేణుగోపాలస్వామి ఆలయం నుంచి నగర కీర్తన చేపట్టారు. పల్లకిలో వేంకటేశ్వరస్వామిని ఊరేగించారు. కోలాటం, చెక్క భజన జరిగాయి. జనసేన రాష్ట్ర నాయకుడు బాబు పాలూరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి తెదేపా సీనియర్ నాయకులు రౌతు రామ్మూర్తినాయుడు, సాయిరమేష్, బంగార్రాజు, గెంబలి శ్రీనివాసరావు, జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

చీపురుపల్లి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా చీపురుపల్లిలోని జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయమూర్తి వై.ప్రేమలత విశ్రాంత ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. చట్టాలపై అవగాహన కల్పించారు. వృద్ధులకు సంబంధించి చట్టాలు, వారి హక్కుల గురించి వివరించారు. విశ్రాంత ఉద్యోగులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఉప కారాగారంలో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో న్యాయమూర్తి ఖైదీలతో సమావేశమై మాట్లాడారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రేమలత

నీరు కావాలంటే.. మురుగులో దిగాల్సిందే!

పాతబొబ్బిలి, దావాలవీధి ప్రాంతాల్లో తాగునీటి కుళాయిలు, పైపులు మురుగు పారే కాలువల వద్ద ఉన్నాయి. మహిళలు వృద్ధులు పారే కాలువలోనే బిందెలు ఉంచి తాగునీరు పట్టుకుంటున్నారు. ధార తక్కువగా వస్తోందని, పైన పెడితే నీరు అందడం లేదని వాపోతున్నారు. బుధవారం పాతబొబ్బిలిలోని పలు వీధుల్లో ఇలాంటి దృశ్యాలు కనిపించాయి. వాటిని మార్చాలని స్థానికులు కోరుతున్నారు. అలాంటి పరిస్థితులు ఎక్కడ ఉన్నాయో గుర్తించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి



ప్రసాద్‌నగర్ కాలనీలో..

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

'పీఎం సూర్యఘర్'తో గిరిజనులకు మేలు



మాట్లాడుతున్న ఎస్ఈ లక్ష్మణరావు

విజయనగరం పట్టణం, ఎస్.కోట, న్యూస్‌టుడే: విద్యుత్తు భద్రతా దినోత్సవాన్ని బుధవారం స్థానిక దాసన్నపేటలోని సబ్‌స్టేషన్‌లో నిర్వహించారు. సిబ్బంది, అధికారులతో ఈపీడీసీఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు ప్రతిజ్ఞ చేయించారు. ● పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమం కింద గిరిజనులందరికీ సోలార్ విద్యుత్తు అందిస్తామని ఎస్ఈ ఎం.లక్ష్మణరావు అన్నారు. బుధవారం ఎస్.కోట మండలం దెప్పూరు గ్రామంలో ఆయన మాట్లాడారు. 'పీఎం సూర్యఘర్' పథకంలో గిరిజనుల ఇళ్లకు ఉచితంగా సోలార్ విద్యుత్తు సదుపాయం కల్పిస్తామన్నారు.

తల్లికి ఘటాల సమర్పణ



విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: పైడితల్లి అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. నెల రోజుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం వివిధ ప్రాంతాల మహిళలు సామూహికంగా ఘటాలతో వెళ్లి, పూజలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)	
విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	80085 74319

సమస్య: రెడ్డికంచేరు గ్రామంలో దుకాణ సముదాయాలు రోడ్డుపైనే నిర్మించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – రమణారావు, స్థానికుడు

సమాధానం: ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తాం. – ప్రభాకరరావు, సీఐ

? : రామచంద్రపేటలో ఇంటింటి కుళాయిల నుంచి నీరు అందించలేదు – వెంకటేశ్, స్థానికుడు

● : త్వరితగతిన పరిష్కరిస్తాను – వైకుంఠంనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

– న్యూస్‌టుడే, భోగాపురం

? కొత్తవలస-సబ్బవరం రోడ్డుకు ఆనుకొని ఒకటి, లోపల ఎస్‌బీఐ శాఖకు ఎదురుగా పొలాల్లో మరో విద్యుత్తు స్తంభం వాలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. – ఎం.రాధాకృష్ణ, లక్ష్మీనారాయణపురం

● : సిబ్బందిని పంపించి సరిచేయిస్తాం. – ఐ.అప్పారావు, ఏఈ, ఈపీడీసీఎల్

– న్యూస్‌టుడే, కొత్తవలస

? : తలారి గ్రామంలో మురుగు కాలువలు పూడికపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు, తలారి

● : కాలువలు శుభ్రం చేసేలా కార్యదర్శికి ఆదేశిస్తాం.– జ్ఞానేశ్వరరావు, విస్తరణాధికారి

– న్యూస్‌టుడే, లక్కవరపుకోట

? : స్టేడియం పేటలో వీధి దీపాలు వెలగడం లేదు. – స్థానికులు

● పరిశీలించి, బాగుచేయిస్తాం. – ఎస్.అప్పారావు, డీఈఈ

? థెరీసా క్లబ్ మార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. – స్థానికులు

● కార్మికులను పంపించి, తొలగింపజేస్తాం. – సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పరిసరాల శుభ్రత బాధ్యత గ్రామాలదే

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇళ్లతో పాటు గ్రామాల పరిశుభ్రతకు ప్రజలంతా ముందడుగు వేయాలని, ఆ బాధ్యత వారిదేనని కలెక్టరు అంబేడ్కర్ కోరారు. విజయనగరం మండలం ద్వారపూడిలో బుధవారం జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ గ్రామాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. జిల్లాలో 15 రోజుల పాటు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. జడ్పీ సీఈవో బి.వి.సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్, ప్రత్యేకాధికారిణి అరుణకుమారి, ఎంపీడీవో చంద్రకళ, సర్పంచి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టరు అంబేడ్కర్

రక్కేస్తున్నాయ్.. కరిచేస్తున్నాయ్!



• శునకాల స్వైరవిహారం

• దాడులతో నగరవాసుల ఆందోళన

న్యూస్‌టుడే, నెల్లిమర్ల

అక్కడ వీధుల్లో తిరగాలంటే స్థానికులు భయపడుతున్నారు.. కొత్తవారు ఆ ప్రాంతానికి వస్తే గాయాలతో వెళ్లాల్సిందే.. నెల్లిమర్ల నగర పంచాయతీ వాసులను శునకాలు హడలెత్తిస్తున్నాయి. పలు వార్డుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ.. దాడులకు తెగబడుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు భీతిల్లుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు భయం గుప్పెట్లో పెట్టుకుని గమ్యస్థానాలు చేరుతున్నారు. పలువురు వీటి దాడులతో గాయాల బారిన పడ్డారు.

నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లోని అన్ని వార్డుల్లో శునకాలు పదుల సంఖ్యల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. 2018లో ఈ రెండు ప్రాంతాల్లో 242 కుక్కలు సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అప్పట్లో 192 శునకాలకు మాత్రమే సంతానోత్పత్తి నివారణకు శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఇంకా 50 శునకాలకు చేయాల్సి ఉంది. ఇప్పటికి ఏడేళ్లయినా మిగతావాటికి శస్త్రచికిత్సలు చేయకపోవడంతో వాటి సంతతి వందల్లో పెరిగిపోయింది. ప్రస్తుతం రెండు ప్రాంతాల్లో వెయ్యికి పైగా సంచరిస్తున్నట్లు చెబుతున్నారు. వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం నిర్లక్ష్యం చూపుతుందని విమర్శలు వస్తున్నాయి.



నెల్లిమర్ల కీర్తివీధిలో శునకాలు

నియంత్రణకు చర్యలు చేపడతాం



ప్రధానంగా రెండు ప్రాంతాల్లో శునకాల నియంత్రణకు ప్రత్యేక చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వాటికి శస్త్రచికిత్సలు చేసేందుకు సరిపడా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో జాప్యం అవుతోంది. మగ, ఆడ కుక్కలకు ఆపరేషన్లు చేసేందుకు వసతులు సమకూర్చుతాం. ప్రస్తుతం వార్డుల నుంచి వేరే చోటికి తరలిస్తున్నాం.

– ఉమాభాస్కరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నగర పంచాయతీ

శస్త్రచికిత్సలు భారం అధికం

శునకాలకు శస్త్రచికిత్సలు చేసేందుకు నగర పంచాయతీపై అధిక భారం పడుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక కుక్కకు శస్త్రచికిత్స నిమిత్తం అప్పట్లో రూ.1500 ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వందల్లో ఉన్న వీటి కోసం రూ.లక్షకు పైగా నిధులు అవసరం. ప్రస్తుతం నగర పంచాయతీలో సాధారణ నిధుల కొరత వేధిస్తుండడం, దీనికి తోడు వీటిని పట్టుకునేందుకు అవసరమైన ప్రైవేటు ఏజెన్సీలు అందుబాటులో లేకపోవడం ఈ ప్రక్రియ నిర్వహించకపోవడానికి కారణంగా చెబుతున్నారు.



నిరుపయోగంగా కుక్కలను శస్త్రచికిత్సలకు తరలించే రిక్షా

ఉద్యోగోన్నతులు కల్పించాలి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ, ఇతరత్రా కారణాలతో ఏర్పడిన ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సహాయకుల ఖాళీలను భర్తీ చేయాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర కార్యదర్శి ఐ.రామునాయుడు డిమాండు చేశారు. విజయనగరంలోని మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్జీటీ, సహాయకుల్లో కొందరు 22 నుంచి 26 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నప్పటికీ ఉద్యోగోన్నతులు లేవన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడు వి.వి.హరి, ఆర్.రమణ, కె.సంతోష్‌లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామునాయుడు

నేటి నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిల్లాలోనే ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఎస్.కోటలోని దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు గురువారం ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం 6.58 గంటలకు కలశ ప్రతిష్ఠ వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. అమ్మవారికి ఉదయం, సాయంత్రం వేద పండితులు భాస్కరశర్మ బృందం ఆధ్వర్యంలో మహా సంకల్పయుత అష్టోత్తర, సహస్రనామార్చనలు జరుగుతాయన్నారు. సామూహిక కుంకుమ పూజలు చేస్తామన్నారు. రెండు పూటలా జోలు విద్వాన్ హరిబాబు బృందంచే ధవళ నాదస్వర కచేరి ఉంటుందన్నారు. ఈ నెల 14న తల్లి ఊరేగింపు, 16న మహాన్నదానం, వస్త్రదానం ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పట్టణమంతా విద్యుద్దీపాలను అలంకరించారు.



విశాఖ ఉక్కుకు గనులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

అయ్యన్నపేట/మయూరికూడలి, కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండు చేశారు. బుధవారం కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. పరిశ్రమలో తయారయ్యే నాణ్యమైన ఉక్కును ప్రైవేటు సంస్థలకు అందించాలని కోరారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యోగులను ఇతర రాష్ట్రాలకు పంపేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు కె.సురేష్, శంకర్రావు, కె.అప్పలసూరి, టీవీ.రమణ, బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా

వేపాడ, న్యూస్‌టుడే: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ సమన్వయకర్త రాంబాబు, కార్యదర్శి భారతి ఆధ్వర్యంలో వేపాడలో బుధవారం సచివాలయ సిబ్బంది ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో చెత్త తొలగించారు. ● జిల్లా నెహ్రూ యువకేంద్రం ప్రతినిధి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు భోగాపురం మండలం ముక్కాం, కొండ్రాజుపాలెం తీరప్రాంతాల్లో వ్యర్థాలను సంచులకెత్తారు. తెదేపా ఎంపీటీసీ సభ్యుడు బాబాజీ, నర్సింహులు పాల్గొన్నారు. ● చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పీవో పన్నుకుళాల ఆధ్వర్యంలో బీచ్ తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించారు.



మురుగు తొలగింది

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: నగరంలోని నటరాజ్‌కాలనీ- 1లో మురుగు, వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు 'మేమున్నాం... మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం రామనారాయణంలో ఈనెల 3 నుంచి 12 వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తలు నారాయణం శ్రీనివాస్, నీరజాపల్లి తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

జామి, న్యూస్‌టుడే: కొత్తవలస ప్రగతి కళాశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో జామి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మొత్తం 15 మంది వివిధ విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్, ఎర్నమ్మ బుధవారం తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ రెహమాన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

తితిదే కల్యాణ మండపంలో ప్రాయశ్చిత్త దీక్ష

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు సనాతన ధర్మ పరిరక్షణ కోసం బుధవారం నగరంలోని తితిదే కల్యాణ మండపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన నాయకులు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి ఆధ్వర్యంలో కల్యాణ మండపం నుంచి మూడులాంతర్లు వద్ద పైడితల్లి అమ్మవారి ఆలయం వరకు నగర సంకీర్తనగా ర్యాలీ చేపట్టారు.



ర్యాలీలో పాల్గొన్న యశస్వి తదితరులు

వెంకన్నకు పల్లకీ సేవ

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రతి పల్లెలోకి ఈ ఆధ్యాత్మిక దీక్షను తీసుకెళ్లాలని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామంలో వేంకటేశ్వరస్వామి పటం పల్లకి సేవలో పాల్గొని మాట్లాడారు. తెదేపా, జనసేన నాయకులు ముత్యాలరెడ్డి, అప్పడుదొర పాల్గొన్నారు.



మహాత్ముని ఆశయాలు కొనసాగించాలి



డెంకాడ: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న రఘురాజు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ



విజయనగరంలో నివాళులర్పిస్తున్న అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి తదితరులు

న్యూస్‌టుడే బృందం: మహాత్ముని ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్ గజపతిరాజు పిలుపునిచ్చారు. నగరంలోని బంగ్లాలో బుధవారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ❖ గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ❖ కలెక్టరేట్‌లో కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేధు మాధవన్, డీఆర్వో అనిత, కోరుకొండ సైనిక పాఠశాలలో ప్రిన్సిపల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి, నగరపాలక సంస్థలో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ నల్లనయ్య, జనసేన పార్టీ కార్యాలయంలో విక్రమ్, భావన, తోటపాలెంలో డీసీసీ అధ్యక్షుడు ఎం.విద్యాసాగర్ ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు. ● పూసపాటిరేగ సూర్యోదయ కళాశాలలో ఎమ్మెల్యే లోకం మాధవి గాంధీ విగ్రహం ఆవిష్కరించారు. ● భోగాపురంలో తహసీల్దారు సురేష్, డెంకాడ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వాసుదేవరావు, నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ బంగారు సరోజని, జిల్లా డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.తిరుపతినాయుడు నివాళులు అర్పించారు. ● ఎస్.కోటలో బాపూజీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీజీ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే లలితకుమారి పాల్గొన్నారు. వేపాడ మండలం జగ్గయ్యపేటలో గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు. ● కొత్తవలస తహసీల్దారు కార్యాలయంలో హెచ్‌డీటీ టి.రమేష్, ఈఓపీఆర్డీ కె.ధర్మారావు నివాళులర్పించారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ



ఎల్.కోటలో ఆర్య, వైశ్య సంఘం ఆధ్వర్యంలో...

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి



అయినాడ కూడలిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

డెంకాడ, న్యూస్‌టుడే: సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అయినాడ కూడలి, డి.తాళ్లవలస గ్రామాల్లో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై డెంకాడ పోలీసులు బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయ వస్త్రధారణ అదిరె

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం భారతీయ సంప్రదాయ వస్త్రధారణ పోటీల్లో విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు వివిధ రాష్ట్రాలకు సంబంధించిన వస్త్రాలను ధరించి, వేదికపై ఆ రాష్ట్రం ప్రాముఖ్యత వివరించారు. కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపల్ భాస్కరరావు మాట్లాడారు. 90 మంది విద్యార్థినులు, 14 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.





స్వచ్ఛతపై సమరం

విజయనగరం విద్యావిభాగం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎస్‌బీఐ ఉద్యోగులు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బాలాజీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శుభ్రత పనులు చేపట్టారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విద్యార్థులు బాలాజీ, కోట కూడలిలో శుభ్రతపై ఫ్లాష్ మాబ్ నిర్వహించారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

కొత్తవలస, న్యూస్‌టుడే: విశాఖపట్నంలోని సీతమ్మధార లోని క్షత్రియ కల్యాణ మండపంలో క్షత్రియ సంక్షేమ సమితి సహకారంతో మంగళపాలెం శ్రీగురుదేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 150 మందికి పైగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ఉపకరణాలు బుధవారం పంపిణీ చేశామని ట్రస్ట్ ఛైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్ తెలిపారు. కృత్రిమ కాళ్లు, చేతులు, పోలియో వ్యాధిగ్రస్థులకు కాలిపర్స్, చక్రాల కుర్చీలు, మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు తదితర ఉపకరణాలు ఉచితంగా ఇచ్చామన్నారు. విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదార్లకు అందజేశారన్నారు.



పోలియో బాధితునికి కాలిపర్స్ తొడుగుతున్న ఆర్డీవో కీర్తి

గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలి



విద్యార్థిని సత్కరిస్తున్న డీవీజీ, ఏబీవీపీ నాయకులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: గిరిజన సంస్కృతి, వారి సంప్రదాయాలను యువత కాపాడాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ.శంకరరావు, ఏబీవీపీ సహ సంఘటన్ కార్యదర్శి గోవింద్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం పీఎస్ఆర్ పాఠశాల ఆవరణలో జనజాతి విద్యార్థుల సమ్మేళనం పండగ వాతావరణంలో జరిగింది. వారు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ, అల్లూరి సీతారామరాజు వెంట నడుస్తూ అనేకమంది గిరిజనులు దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. అడవిని, నీటిని, భూమిని నిత్యం దేవతలుగా కొలుస్తూ ప్రకృతి మాత బిడ్డలుగా ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం పలువురికి బహుమతులు అందించారు.

సంక్షిప్త సమాచారం

కథా పఠన పోటీలు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విద్యార్థులు భాషపై పట్టుసాధించాలని బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కొత్తపేటలోని కాశీపతిరావు స్మారక భవనంలో కథా పఠన పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులిచ్చారు.

అభినందన



నేరవార్తా విభాగం: భగత్‌సింగ్ ఫెస్ట్ సందర్భంగా ఇటీవల నగరంలో జరిగిన జిల్లా స్థాయి శరీర సౌష్ఠవ పోటీల్లో 8 మందికి వివిధ కేటగిరీల్లో బహుమతులు దక్కాయి. వారిని జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకరరావు అభినందించారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు

విజయనగరం నేరవార్తా విభాగం: రెండు రోజుల క్రితం నగరంలోని ఉడాకాలనీలో ఉన్న విద్యుత్తు శాఖ ఉద్యోగి ఇంట్లో జూదమాడుతూ అయిదుగురు వ్యక్తులు ఒకటో పట్టణ పోలీసులకు పట్టుబడ్డారు. వారిలో ఓ కానిస్టేబుల్ ఉండటం గమనార్హం. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

హామీలు అమలు చేయాలి

ఉడాకాలనీ: వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు సుపరిపాలన అందించిన ఘనత వైకాపాదేనని జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. తన ఛాంబరులో మాట్లాడారు. కూటమి హామీలను అమలు చేయాలని డిమాండు చేశారు.

న్యాయవాది మృతి



న్యాయవార్తావిభాగం: ఆకాశపు వీధికి చెందిన సీనియర్ న్యాయవాది ఆకాశపు మురళీమోహన సత్యనారాయణ(69) అనారోగ్యంతో బుధవారం మరణించారు. ప్రభుత్వ న్యాయవాదిగా అయిదేళ్లపాటు పనిచేశారు. తెదేపా సీనియర్ నాయకుడిగా ఉన్నారు. రెండు సార్లు కౌన్సిలర్‌గా వ్యవహరించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సంతాపం తెలిపారు.

ఆవిర్భావ దినోత్సవం

విజయనగరం ఉడాకాలనీ: ప్రజలు మంచి రాజకీయాల వైపు అడుగులు వేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. బుధవారం నగరంలో పార్టీ 19వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. జెండా ఎగురవేశారు.

ఎక్సైజ్ సీఐగా రవికుమార్

భోగాపురం: భోగాపురం ఎక్సైజ్ సీఐగా వి.రవికుమార్, ఎస్ఐగా సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎక్సైజ్ సీఐ పార్వతీపురం నుంచి ఎస్సై వీరఘట్టం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

మద్యం సీసాల స్వాధీనం

ఎల్.కోట: రంగాపురం శివారు కూర్మవరంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఎల్.వాసు అనే వ్యక్తిని అరెస్టు చేసి, 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు.